# శనక్కాయలమ్మా!

సాయంత్రం ఆరున్నర...!

విశాఖ నుండి కాకినాడ పోయే ఫాస్ట్ పాసింజరు అప్పుడే... అనకాపల్లి విడిచిపెట్టింది.

కన్నతల్లి ప్రేమలా చల్లటిగాలి రైలు పెట్టెల్లోకి చొచ్చుకుని వచ్చింది. కిటికీ పక్కసీటులో కూర్చుని బయటకి చూస్తున్నాను. కర్మసాక్షి ఎప్పుడో - కనుమరుగయ్యాడు. విశ్వరంగస్థలం మీద చీకటి తెరలు తెరలుగా నర్తించడానికి ఆయత్తమవుతోంది...

పాసింజరు వేగం పుంజుకుంది. చిన్నచిన్న ఊళ్లు, పొలాలు, చెట్లు, స్తంభాలు, టెలిఫోన్ తీగెలు వేగంగా వెనక్కి కదిలిపోతున్నాయి.

"శనక్కాయలమ్మా!"

ఉలిక్కిపడి తలతిప్పాను. ఎదురుగా ఓ నడివయసు స్త్రీ... నల్లటి అంచుఉన్న తెల్లచీర కట్టుకుంది. భుజం మీద చిరుగు పట్టిన బూడిదరంగు రవిక తొడుక్కుంది... చింపిరి జుట్టును కొప్పుగా ముడి పెట్టుకుంది. నుదుట బొట్టు లేదు. చెవులకి రాగి దిద్దులు తాపడం చేసినట్టుగా ఉన్నాయి. ఆమె చంకలో చిన్నతట్ట... ఆ తట్టలో సగానికి పైగా వేపిన వేరు శెనక్కాయలు ఉన్నాయి.

"శనక్కాయలమ్మా!" ఆమె మళ్లీ అరిచింది. ఆ అరుపులో విస్పష్టమైన ధ్వని ఉంది! ఆ ధ్వని నాకు సుపరిచితమే. ఎన్నోసార్లు, ఎన్నోచోట్ల, ఎందరి గొంతుల్లోంచో విన్నదే...

"బాబూ! శనక్కాయలు! కమ్మగున్నయి... కరకరలాడతన్నాయి...: శనక్కాయలు... శనక్కాయలు!" ఆమె అరుస్తోంది. అందరి ముఖాల్లోకి చూస్తోంది. అడుగులో అడుగు వేస్తూ ఒక బెంచీ నుంచి ఒక బెంచీకి కదులుతూంది. ఎవరూ ఆమె శనక్కాయలు కొనడం లేదు...

పరుగెత్తే రైలు చక్రాల ధ్వనిలో ఆమె గొంతు ప్రత్యేకంగా వినబడుతోంది... ఆసక్తిగా ఆమెను చూస్తున్నాను.

"బఠాణీ! కాలక్షేపం బఠాణీ!" ఎవరో పొట్టకాలుతో, బఠాణీల బుట్టతో వచ్చాడు. ఎదురుబెంచీలోని ఇద్దరు ప్రయాణీకులు, వాడివద్ద బఠాణీలు కొంటున్నారు.

"సమోసా! వేడివేడి సమోసా!" స్టీలు ట్రేను ఒకచేత్తో ఎత్తి పట్టుకుని, కాకిలా అరుస్తూ మరొకడు కంపార్టుమెంటులోకి వచ్చాడు. వాడి సమోసాలు అమ్ముడవుతున్నాయి.

నేనెక్కిన పెట్టెలో జనం నిండుగానే ఉన్నారు...!

"నడిపించు నానావ, నడి సంద్రమున దేవా..." కళ్ళు లేని కబోధి, వృద్ధురాలు,

పదేళ్ల కుర్రాడి సాయంతో, పాడుతూ చేయిచాపి అడుక్కుంటోంది. ఆ వృద్ధురాలి చేతిలోనూ చిల్లరపడుతోంది.

"శనక్కాయలు... శనక్కాయలు..." ఆమె అరుస్తూ నా దగ్గరకొచ్చింది.

"బావూ! శనక్కాయలు..." ఆశగా నా వైపు చూసింది. నేను జేబులోంచి ఒక రూపాయి తీసి, ఆమె చేతిలో పెట్టాను. ఆమె ముఖం ఇంత చేసుకుంది. కాగితాన్ని బొంగరంలా చుట్టి... అందులో కాయలు కొలిచి, పోసి, నా చేతికిచ్చింది...

'ఎందుకంత గట్టిగా, గొంతు చించుకుని అరుస్తావ్...? మామూలుగా అమ్ముకోవచ్చుగా...?' నేను కావాలనే అడిగాను.

"అరవకపోతే ఆకలెట్టా తీర్తది నాయనా! మా కడుపులు నిండాలంటే ఎక్కిన బండిలో ఎలగన్నా కుంచెడు కాయలు అమ్ముకోవాలిగా..." ఆమె నిర్వేదంగా అంది.

"ఏవూరు మీది...?"

"ఏవూరయితే నేటి బావు! ఎందుకలా అడగతన్నవూ..?"

'ఊరికినే నీ గురించి తెలుసుకుందామని...'

"మాది పాయకరావు పేటే... నా పేరేటయితేనేంలే! పేరెప్పుడో మరిసిపోనాను... నానందర్కీ శనక్కాయలమ్మనే... నాలుగు బళ్లు ఎక్కి నాలుగు కుంచాల కాయలమ్ముకుంతాను... ఇంతకన్న ఏటుంది..?"

శనక్కాలయలమ్మ తట్ట కింద పెట్టి చతికిలపడింది... నేను రూపాయి శనక్కాయలు కొనడంతో... ఆమెకు బేరం మొదలయ్యింది. నేనామెతో మాటలు పెంచాను...

"శనక్కాయలమ్మా? రోజుకెంత సంపాదిస్తావు నువ్వు...?"

"ఎంతని సెప్పమంతావు నాయినా? మా బతుకుల్లాగే బేరాలు గాలి వాటంగుంటాయి... ఒక్కోపూట కుంచెడు కాయలమ్మినా.. ఒక్కోపూట అద్దెడు కాయలూ అమ్ముడు కావు... ఈ పూట ఏటో బేరం అలాగే ఉన్నాది...".

"నాలుగు కుంచాల కాయలూ అమ్ముడుబోతే... నీకు లాభం..."

"లాభం ఏటుంటది బావూ! దినవంతా దిక్కులేని పక్షిలా అరిసి గీపెడితే... పాతిక రూపాయల డబ్బులు కళ్లబడతయ్యేమో... నేకపోతే నేదు..."

"కూలి పనికెల్తే ఇంకా ఎక్కువ డబ్బులు వస్తాయిగా!"

"వస్తయిబావూ! సేసుకున్నోళ్లకి సేసుకున్నంత... నానా కట్టంపళ్లేను... నడుం జారిపోతాది. నరాలు లాక్కుపోతాయి..."

ఏదో చిన్న స్టేషన్లో బండి ఆగి మళ్లీ బయలుదేరింది. నేను కూర్చున్న పెట్టెలో ఒక దీపం మాత్రం వెలిగింది. పల్చటి వెలుతురు మా అందరిమీదా పరుచుకుంది.

"నీకెంతమంది పిల్లలు?..." శనక్కాయలు ఒలుచుకుని, నోట్లో వేసుకుంటూ అడిగాను.

"ముగ్గురు ఆడశనక్కాయలు బావూ! పెద్దపిల్ల ఇంటికాడే ఉంటది. వంటసేస్తది. సెల్లెళ్లకింత కూడు పెట్టి... పలకా బలపం ఇచ్చి బళ్లో కంపుతాది. ఆల్లకోసమేగా నాయీ పాట్లు తండ్రీ... బగమంతుడా!"

శనక్కాయలమ్మకు పిల్లలే గుర్తుకువచ్చారో... ఏవి జ్ఞాపకాలు ఎదలో కలుక్కుమన్నాయో... ఆమె కళ్లల్లో కన్నీటి పొర రెపరెప లాడింది...

"మీ ఆయన..."

"నాకూ నా బిడ్డలికి అన్నేయం సేసిపోనాడు బాబూ! ఆడే బతికుంటే నాకీ తిప్పలేం - నాయినా?"

నుదుట బొట్టు లేదు... మెడలో సూత్రం లేదు... చేతులకి గాజులూ, కాళ్లకి మట్టెలూ లేవు... తెల్లచీరలో భర్త హీనగా ఆమె రూపం తెలుస్తూనే ఉంది. అనవసరంగా ఆమె భర్త గురించి అడిగి బాధ పెట్టానేమో... మనసు నిండా అపరాధ భావం...

"పాపం! ముగ్గురూ ఆడ పిల్లలేనన్న మాట...' సానుభూతిగా అన్నాడు.

"ఆడపిల్లలయితే నేటి బావూ? నిన్ను గన్న అమ్మ ఆడది కదా? నన్ను గన్న తల్లి ఆడది కాదా...? ఆడది నేకపోతే నానెక్కడుంతాను...? నువ్వెక్కడుంతావు...?"

ఆమె మాటల్లోని పదునుకు... నాకు ఆశ్చర్యం కలిగింది...!

శనక్కాయలమ్మ తటాలున తట్టపట్టుకుని లేచింది. ఆమె ముఖ కవళికల్లో మార్పు... కొట్టొచ్చినట్లుగా కనిపించింది. చీరకొంగుతో కళ్లు ఒత్తుకుంది.

"ఆడునేకపోతే నేంబావూ! నా బిడ్డలికి నాను లేనా...? కళ్లల్లో ఎట్టుకుని కాపాడుకోనా...? ఏదో కట్టం, సుకం అడిగినావు... ఏ తల్లి కొడుకువో... సల్లగుండు... ఎల్లొస్తా!"

"శనక్కాయలమ్మా" పెద్ద గొంతుతో అరుస్తూ ఆమె మరో పెట్టెలోకి వెళ్లిపోయింది.

పడిలేచే కడలి తరంగం హోరు... నాకా క్షణంలో వినిపించింది...

శనక్కాయలు ఒల్చుకుంటూ తింటున్నాను. మనసులో ఏమూలో... ఎందుకో తడి తడిగా ఉంది. ముగ్గురు శనక్కాయల్లాంటి పిల్లలు. తలచెడిన ఒంటరి బతుకు... మగతోడు లేని జీవితం... ఎక్కేబండి... దిగేబండి... ఎన్ని గండాలు? మరెన్ని సుడిగుండాలు...? పాపం శనక్కాయలమ్మ శాపగ్రస్త...!

ఫాస్ట్ పాసింజరు నర్సీపట్నం రోడ్డు దాటిపోయింది...

ఉదయం ఇదే పాసింజరులో కాకినాడలో తెల్లవారుఝామున నాలుగు గంటలకు

బయలుదేరి... పది గంటలకు విశాఖ చేరుకోవడం... పదకొండు గంటలకు 'ఆకాశవాణి'వారు నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొనడం... సాయంత్రం ఇదే పాసింజరులో తిరుగు ప్రయాణం... పాసింజరు బండి తుని వైపు ఫాస్ట్‌గానే పరుగెడుతోంది... ఏ ఆటంకం లేకపోతే, తొమ్మిదీ తొమ్మిదిన్నరకు కాకినాడ చేరుకోవడం ఖాయం... పదిగంటలకల్లా ఇంట్లో ఉండొచ్చు.

తలపాగా చుట్టుకున్న ఓ తాత చిన్న గంపలో జామికాయలు అమ్ముతూ వచ్చాడు. శ్రీమతి, పిల్లలు కళ్లల్లో కదిలారు. పిల్లల కోసం అరడజను జామికాయలు కొన్నాను... జంతికలు, చేగోడీల 'జంగిడీ' వస్తే... పదేసి చొప్పున పొట్లాం కట్టించాను. కవిత, వంశీలు సరదాపడి తింటారు! వాళ్లకు అవంటే చెడ్డ ఇష్టం...!

"అయ్యల్లారా! అమ్మల్లారా! ఒక్కపాలి ఇటుసూడండి!"

నేను అటువైపు చూశాను. ఆ వ్యక్తి గెడ కర్రలా ఉన్నాడు. గెడ్డం నున్నగా ఉంది... గళ్ల చొక్కా, పైజమాలో ఉన్నాడు. మెడకు మఫ్లరు చుట్టుకున్నాడు. కళ్లకు రంగుటద్దాల జోడు పెట్టుకున్నాడు. అతని కాళ్ల దగ్గర చిన్న ట్రంకు పెట్టె ఉంది. ప్రయాణీకులు వింతగా అతనివైపు చూస్తున్నారు.

"అయ్యా! ఈ లుంగీ రేటు డెబ్బై రూపాయలు... దీన్ని ఏలం ఏస్తన్నాను. ఇందులో మోసం, గీసం నేదు... అందరూ సరదాపడి పాడుకోవచ్చు. అదురుస్టం మీది. నాకు నాబం అక్కర్నేదు... నా పేరు సింవాద్రి... ఇశాపట్నం జగదాంబ సెంటర్లో - బంగారమ్మ బట్టలకొట్టు మాదే... ఈ లుంగీ దేవుడి పాట పదిరూపాయలు... పది రూపాయలు..."

సింహాద్రి అన్న ఆ వ్యక్తి గొంతు సాగదీసుకుంటూ... ఒకటోసారి, రెండోసారి... అంటూ అందంగా అరుస్తున్నాడు... అందరికీ లుంగీని విడదీసి చూపిస్తున్నాడు... ప్రయాణీకుల్లో ఒకతను వెంటనే పదిహేను అన్నాడు. మరొకతను ఇరవై... అతని పక్కమనిషి పాతిక... వెనుకబెంచీలోంచి ఎవరో ముప్పైఅయిదూ అన్నారు. పాట అంతటితో అయిపోయింది... లుంగీ ఖరీదు గిట్టుబాటు కాలేదేమో... వేలంపాట సింహాద్రి తన లుంగీని ట్రంకుపెట్టెలో పడేసుకున్నాడు. ముప్పైఅయిదు పాడిన వ్యక్తి చేతికి, కానుకగా చిన్న దువ్వెన అందించాడు. తరువాత, ఒక గళ్ల దుప్పటి బయటికి తీశాడు. అదీ, అసలు రేటుకు కిట్టలేదేమో పాడిన వ్యక్తికి ఒక పెన్సిలు బహుమతిగా ఇచ్చాడు. ఈసారి రెండు తువ్వాళ్లు పెట్టెలోంచి పైకి తీశాడు. ఆ తువ్వాళ్లని ఎవరో పాతిక రూపాయలకు పాడుకున్నారు. ఒక చొక్కా గుడ్డ, ఒక ఫేంటు ముక్క, చిలకాకుపచ్చ వాయిలు చీర, నాలుగు జేబురుమాళ్లు... ఇలా ఒకటి తరువాత ఒకటి వేలం పాట... సందడిగా సాగుతోంది... సింహాద్రి ఒకటోసారి, రెండోసారి అంటూ ఉత్సాహంగా కేకలు పెడుతున్నాడు...!

వేలంపాటను వినోదంగా తిలకిస్తున్నాను...

ఈసారి అతను సిల్కుగుడ్డ నొకదాన్ని బయటికి తీశాడు. ఆ గుడ్డ గులాబీ రంగులో ఉంది. వెడల్పుగా, అంచు పొడవునా పువ్వుల అల్లికతో మిసమిసలాడుతోంది.

"అయ్యా! ఇది దుబాయ్ సిల్కుగుడ్డ... ఆడోల్లకి రెండు రయికలయితాది. సిన్నోల్లకి సిన్నపాపలకి, ఒక గౌను కుట్టిస్తే... రెండు లాగులకి గుడ్డ మిగిలిపోతాది... దేవుడి పాట అయిదు రూపాయలు... అయిదు రూపాయలు..."

అటూ ఇటూ బెంచీల్లోని ఆడవాళ్ళు, మగవాళ్లు పోటీపడి ఆ గుడ్డను ఏభై రూపాయల వరకూ పాడారు. ఒకటోసారి... రెండోసారి... సింహాద్రి పదేపదే అరుస్తున్నాడు... ఎవరూ ముందుకు పాడలేదు...

"ఏభై అయిదు రూపాయలు! ఏదీ గుడ్డ నాకియ్యి..."

ఎప్పుడో వచ్చిందో 'శనక్కాయలమ్మ' సింహాద్రి వెనుకగా వచ్చి నిలబడింది. సింహాద్రి వెనక్కి తిరిగాడు. శనక్కాయలమ్ముకునే ఆడది ఖరీదైన సిల్కుగుడ్డ కొనడం ఏమిటీ అనుకున్నాడేమో... నిర్లక్ష్యంగా ఆ గుడ్డను పెట్టెలో పడేసుకున్నాడు.

"ఏటీ ఆ గుడ్డ నాకియ్యవేటి? నాకాడ డబ్బులు లేవను కుంతన్నావా...?"

శనక్కాయలమ్మ ఉక్రోషంగా అడిగింది. బొడ్డు దగ్గర దోపుకున్న డబ్బుల'చిక్కం' బయటకి తీసింది.

"ఈ గుడ్డరేటు నాకు గిట్నేదు... ఎల్లెల్లు"

సింహాద్రి మరో గుడ్డముక్క తీసి వేలం పాట మొదలుపెట్టాడు... శనక్కాయలమ్మ ముఖం చిన్నబోయింది... వేలంపాట మళ్లీ కొనసాగుతోంది...

శనక్కాయలమ్మ అటూ ఇటూ చూసింది. కూర్చున్నట్లు నెమ్మదిగా ఒంగింది... చటుక్కున సిల్కు గుడ్డను, తెరచి ఉన్న అతని ట్రంకు పెట్టెలోంచి తన తట్టలో వేసుకుంది... నాలో ఆశ్చర్యం... అర్థం కాని భావసంచలనం...! నా దృష్టి శనక్కాయలమ్మ మీదే ఉంది. వేలంపాట పాడుతూ సింహాద్రి ఎప్పుడు గమనించాడో... సాచిపెట్టి ఆమెను చెంపమీద కొట్టాడు. చంకలోని తట్టను లాగి కాలితో బంతిలా తన్నాడు. తట్ట ఎగిరిపడింది. కాయలు చెల్లా చెదరయ్యాయి. కాయలతో బాటు రెండు రిబ్బనుముక్కలు, పెన్సిలు, బాల్‌పెన్ను... చిన్నసబ్బుముక్క... ప్లాస్టిక్ పర్సు... అరడజను చిలకలపూడి గాజులు కిందపడ్డాయి.

"అయ్యా! మీ కళ్ల ముందే ఇదేటిసేసినాదో సూసినారా? దాని గుణం సెడ్డది... దొంగది... రైల్లో శనక్కాయలమ్ముకుంటూ సిన్న సిన్న దొంగతనాలు సేస్తది... మీ కళ్లు కప్పి... కల్లబొల్లి కబుర్లు సెప్పి మీ పర్సులు కొట్టేస్తది... నా గుడ్డలు... ఎన్ని ఎత్తుకు పోనాదో... దొంగ నం..."

పెద్దగొంతుతో సింహాద్రి శనక్కాయలమ్మ బతుకునీ, శీలాన్ని వేలం వేసి

పొడుతున్నాడు.

ముగ్గురుబిడ్డల తల్లి... మొగుడు లేని ఆడది... శనక్కాయలమ్మ దొంగదీ అనుకోవడం నాకెందుకో బాధగా ఉంది... గుండె బరువుగా ఉంది...

శనక్కాయలమ్మ స్థాణువులా అక్కడే నిలబడి ఉంది... అవమానంతో... కూరుకుపోతున్నట్లు తల ఒంచుకుని అరచేయిని అడ్డం పెట్టుకుంది.

"అంతేనేటండీ... ఇది రోజుకొకడితో తిరుగుతాది... గుడిసేటి నం..."

సింహాద్రి వాక్రప్పవాహం ఠక్కుమని ఆగిపోయింది. పూనకం వచ్చిన దానిలా శనక్కాయలమ్మ, సింహాద్రి మీదపడి రెండు చెంపలు వాయించింది. ఊహించని సింహాద్రి ఒక్క ఉదుటున ఆమెను వెనక్కి నెట్టాడు...

"దొంగనం... కానా! నన్నే కొడతావేటే... నిన్నేటి సేస్తానో సూడు... ఈ రైల్లోంచి నిన్ను బయటికి తోసియ్యకపోతే నాను..'' సింహాద్రి పిచ్చి కోపంతో ఊగిపోతూ, శనక్కాయలమ్మను, జుట్టుపట్టుకుని, తన్నుకుంటూ తలుపు దగ్గరకు ఈడ్చుకుని పోతున్నాడు.

శనక్కాయలమ్మ విదిలించుకుంటోంది. తిట్లు తిడుతోంది. శాపనార్థాలు పెడుతోంది. సింహాద్రి ఆమెను వదల్లేదు...

ఫాస్ట్ పాసింజరు ఠన్‌ఠన్‌మంటూ లయబద్ధంగా పరుగు తీస్తోంది... ప్రయాణీకుల్లో కొందరు గొణుక్కుంటున్నారు తప్ప, వాళ్ళ గొడవలో ఎవరూ తల దూర్చడం లేదు.

నేను విసురుగా వెళ్లి సింహాద్రి చేయి పట్టుకున్నాను.

"ఏయ్! ఆ మనిషిని వదిలెయ్! ఆవిడ్ని నువ్వు కొట్టావ్! ఆవిడా నిన్ను కొట్టింది... తీరిపోయిందిగా... ఎందుకొచ్చిన గొడవ...?"

అతను ఆగలేదు... విసురుగా నా చేతిని వదిలించుకున్నాడు.

బయటంతా చిమ్మచీకటి... బండి దూసుకుపోతోంది... ఎవరు అడ్డుకున్నా సింహాద్రి ఆగలేదు. శనక్కాయలమ్మను బరబరా పెట్టె చివరకు లాక్కొనిపోయాడు. తలుపువద్ద ముగ్గురు ముష్టివాళ్లు అడ్డుకున్నా వాళ్లనూ విదిలించికొట్టాడు... బండబూతులు తిట్టాడు. నా మనసు విలవిలలాడుతోంది. జనం గోలగా... గొడవగా... గుంపుగా... గుమ్మం వద్దకు, ముందుకు నేను వెళ్లలేకపోయాను... మరుక్షణంలో 'దబ్'మన్న శబ్దం... ఆ వెంటనే - 'అమ్మా' అన్న పెనుకేక... ఆ చీకట్లో... గాల్లో... రైలు ఠనాఠన ధ్వనిలో... దారుణంగా... దయనీయంగా... కలిసిపోయింది...!

పెట్టెలోని జనం, అందరికీ... ఎవరికి వాళ్లకే శరీరాలు బిగుసుకుపోయాయి. అందరి గుండెల్లోనూ అలజడి... నోటమాటలు లేవు... ఒక దారుణ దృశ్యానికి సంఘటనకీ సాక్షీభూతులుగా ఉండిపోయామన్న భయం... ఆందోళన...!

నాకు స్పృహ వచ్చినట్లుగా గొలుసు లాగడానికి పరుగెత్తాను...

"ఆగండి... గొలుసు లాగొద్దు... బండి నా పొద్దు..."

ఎదురుగా శనక్కాయలమ్మ... ఆవేశంగా... ఆయాసంగా...

ఓమైగాడ్! ఏం జరిగింది? శనక్కాయలమ్మ క్షేమంగానే ఉంది... అంటే ఇద్దరి పెనుగులాటలో శనక్కాయలమ్మ సింహాద్రిని రైల్లోంచి... పట్టాల మీదకు తోసి...

సింహాద్రి ఏమయ్యాడు..? చనిపోయాడా..?

జరిగిని సంఘటన నా మెదడు జీర్ణించుకోలేకపోతూంది... బాధ్యత గల పౌరునిగా నేను బండి గొలుసు లాగాలా? వద్దా? ఏం చేయాలి?

"బావూ! ఆడు నా మొగుడే... అగ్గిని సాచ్చిగా నా మెళ్లో తాళికట్టినోడే... ఏడేళ్ల కాపురం సేసినాక... నన్నూ నా బిడ్డల్నీ - ఆడు ఒగ్గేసినాడు... ఏరే దాన్నుంచుకుని ఇశాపట్నం ఎల్లిపోనాడు... కట్టుకున్న దాన్నన్న కాపీనం లేదు... కన్నబిడ్డలన్న కనికరం లేదు... నానేటి సెయ్యను...? పెద్ద మడుసుల్లో ఎట్టినాను... పోలీసు కేసెట్టినాను... బావూ! ముగ్గురు బిడ్డలూ ఆడికి పుట్టనేదన్నాడు... నాను తప్పుడు మడిసినన్నాడు... నానేటి సెయ్యాల...? సావాలా...? పెద్దమడుసులు సీకొట్టినా, పోలీసులు సితగొట్టినా, ఆడికి సిగ్గునేదు... బుద్దినేదు...

"ఈ బూమ్మీద ఇంతకన్న అన్నేయం ఏటుంది బావూ...? ముగ్గురు బిడ్డలు పుట్టినాక ఆడిసుకానికి నాకు పనికి రాకుండా పోనాను... బావూ! ఆడికి డబ్బు గావాల! కండబట్టిన ఆడదాని ఒళ్లు గావాల - నాకాడ ఆ రెండూ నేవు... ఆడుంచుకున్న బంగారమ్మ కాడున్నాయి... బావూ! నాను దొంగదాన్ని కాదు... సెనక్కాయలమ్ముకుంతన్న దాన్ని... సెవటోడ్చి - నా బిడ్డల కోసమే బతుకున్నదాన్ని... ఆడితో గొడవెట్టుకుందామనే... నానా గుడ్డముక్కని తట్టలో ఎట్టుకున్నాను...

"బావూ ఆడు బతికున్నా నాకు సచ్చినోడే... ఆడు సచ్చిపోనాడనే నాను - తెల్ల సీర కట్టుకుంతన్నాను... మెళ్లో తాలి... మొకాన బొట్టూ నేకండా ఆడి ముందట్నే తిరగతన్నాను... నన్ను సూస్తంటే ఆడి గుండె మండిపోతన్నాది... నన్ను సంపాలనుకుంతన్నాడు... నానేటి సెయ్యాల? నానుసేసింది - తప్పంతారా బావూ...? తప్పంతారా...? సెప్పండి...?"

ఏమని చెప్పాలి? ఏం చెప్పాలి?

శనక్కాయలమ్మ కిందపడిన తన తట్టను శనక్కాయల్ని, వస్తువుల్నీ - ఆత్రంగా ఏరుకుంటోంది... ఆమె కళ్లల్లో నీళ్లు లేవు... ఎరుపు జీరలున్నాయి. ఆ గొంతులో ఏడుపు లేదు... ఎగిసి వస్తోన్న ఆవేశం ఉంది... ఆమె మాటల్లో - అధైర్యం లేదు... ఆత్మవిశ్వాసం ఉంది. అందరికీ ఆమె రూపం కొత్తగా ఉంది. ఎవరూ ఏమీ మాట్లాడడం లేదు... ఎవరికి వాళ్లే సామాన్లు సర్దుకుంటున్నారు. స్టేషన్ వస్తున్నది కాబోలు... ఎప్పుడు దిగిపోదామా

అన్నట్లుగా ఉన్నారు... సింహాద్రి నిజంగా చనిపోతే ఆమె చేసిన పని నేనూ సమర్థించను... చట్టం ఆమెను శిక్షిస్తుంది...

కాని శనక్కాయలమ్మ అంతరంగం... ఆమె తెగువ... ఆరాటం... పోరాటం... అంతర్మథనం నాకు అర్థమవుతున్నాయి... స్త్రీ పురుష సంబంధాలు చిత్రంగా మలుపు తిరుగుతున్న ఈ సంధి కాలంలో... ఆమె చేసిన పని... శివమెత్తిన స్త్రీ చైతన్యానికి ఒక ప్రతీక...!

తుని స్టేషన్‌లో బండి ఆగింది... ఎక్కేవాళ్లు ఎక్కుతూంటే, దిగేవాళ్ళు - దిగుతున్నారు. శనక్కాయలమ్మ గబగబా తట్ట పట్టుకుని దిగింది. ప్లాట్‌ఫారం మీద దీపాల వెలుగులో... నిశ్చలంగా... నిర్భయంగా నడుస్తోంది...!

"శనక్కాయలమ్మా!" అంటూ అరుస్తోంది... ఆ పిలుపుతో శనక్కాయల్లాంటి - తన పిల్లల్నే పలవరిస్తోన్నట్టుగా నాకు అనిపిస్తోంది...!

❀ ❀ ❀ ❀ ❀ ❀

**(ఆంధ్రప్రభ... వీక్లీ... 2.4.97)**